క్లుప్తంగా

చిన్నారుల డిశ్చార్జి

నర్సాపూర్: చుంచు ఎలుక పడిన నీళ్లు తాగి అస్వస్థతకు గురై చికిత్స పొందిన చిన్నారులను మంగళవారం డిశ్చార్జి చేసినట్లు స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి ఆర్ఎంఓ డాక్టర్ రాజేష్‌కుమార్ చెప్పారు. ఈనెల 23న శివ్వంపేట మండలంలోని రత్నాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో చుంచు ఎలుక పడిన నీళ్లు తాగి ఎనిమిది మంది చిన్నారులు అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చేరారన్నారు. ఇందులో ఒక బాలుడిని మెరుగైన చికిత్స నిమిత్తం మెదక్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామన్నారు.

అదనపు గదులు మంజూరు చేయండి


వినతిపత్రం ఇస్తున్న సత్యనారాయణ గౌడ్

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండలంలోని జగ్గంపేట పాఠశాల శిథిలావస్థలో చేరిందని, రెండు అదనపు గదులు నిర్మించేందుకు కృషి చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ గౌడ్ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఎంపీ రఘునందన్‌రావును హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో పాఠశాల శ్లాబ్ కూలడంతో ఒకే గదిలో ఐదు తరగతుల విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నామన్నారు. దీంతో విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాజేందర్ ఉన్నారు.

ఎంపీని కలిసిన బీజేపీ నేతలు

మెదక్‌జోన్: బీజేపీ జిల్లా నూతన కమిటీ సభ్యులు మంగళవారం ఎంపీ రఘునందన్‌రావును కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీని కలిసిన వారిలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు మల్లేశంగౌడ్, ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమేష్ గౌడ్, తదితరులు ఉన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు


తనిఖీలు చేస్తున్న పోలీసులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): వినాయక నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టామని ఎస్‌ఐ నర్సింహులు అన్నారు. మంగళవారం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండల పరిధిలోని ప్రధాన కూడళ్లు, ఆధ్యాత్మిక ప్రాంతాలతో పాటు రద్దీ ప్రదేశాల్లో మంగళవారం డాగ్ స్క్వాడ్, బాంబ్ స్క్వాడ్ సహకార విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనుమానస్పదంగా ఎవరైన కనబడితే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు.

ఉత్సాహంగా ఎన్‌సీసీ అభ్యర్థుల ఎంపిక


అభ్యర్థులను ఎంపిక చేస్తున్న అధికారులు

మెదక్‌జోన్: విద్యార్థుల్లో దేశభక్తి పెంపొందించేందుకు ఎన్‌సీసీ ఎంతో దోహదపడుతుందని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ హుస్సేన్ పేర్కొన్నారు. మంగళవారం డిగ్రీ కాలేజీలో ఎన్‌సీసీ అభ్యర్థుల ఎంపికలు ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభ్యర్థుల ఎంపికలో అకాడమిక్ కో–ఆర్డినేటర్ శరత్ రెడ్డి, ఎన్‌సీసీ కేర్ టేకర్ ఆఫీసర్ సురేందర్ రావు, 33వ బెటాలియన్ ఎన్‌సీసీ సుబేదార్ సర్వన్, ఆర్‌కే మేనేజర్ హవల్దార్ తోడ్పాటు అందించారన్నారు. ఇందులో సుమారు 200మంది అభ్యర్థులు ఎంపికయ్యారని చెప్పారు.

ఆర్‌ఐపై చర్యలు తీసుకోవాలి

పాపన్నపేట(మెదక్): 'పౌతి' కోసం వెళ్తే గిరిజనులను వేధింపులకు గురిచేసిన ఆర్‌ఐపై చర్యలు తీసుకోవాలని ఉమ్మడి మెదక్ జిల్లా బంజారా సేవాలాల్ సంఘం కార్యదర్శి రాజు నాయక్, రాష్ట్ర ఉపాధ్యక్షులు పూల్‌సింగ్, రమేశ్‌నాయక్, ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర కోఆర్డినేటర్ అల్లారం రత్నయ్య మంగళవారం వేర్వేరు ప్రకటనల్లో డిమాండ్ చేశారు. ఫౌతి స్లాట్ అయిన తర్వాత వెంటనే అమలు చేయాల్సిన ఆర్‌ఐ విచారణ పేరిట 12 రోజుల వరకు పెండింగ్‌లో ఉంచడం సరికాదన్నారు. ఎందుకు చేయలేదని నిలదీస్తే కేసులు పెడతానని బెదిరిస్తున్నారన్నారు. గిరిజనులను భయపెట్టడం అమానుషమన్నారు. ఆర్‌ఐపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.


చిన్నశంకరంపేట: చందాపూర్ ప్రాథమిక పాఠశాలలో..


చేగుంట: మట్టివినాయకులను తయారు చేసిన విద్యార్థులు

మట్టి గణపతికే జై

- కాలుష్య నివారణే లక్ష్యంగా..
- వినూత్నంగా మట్టి, ఆకులు, కాగితాలతో తయారీ
- ఏకో ఫ్రెండ్లీ మట్టి విగ్రహాలకు పెరుగుతున్న ఆదరణ

జిల్లా వ్యాప్తంగా ఏకో ఫ్రెండ్లీ మట్టి విగ్రహాలకు ఆదరణ పెరుగుతోంది. ఇందులో భాగంగానే 'మట్టి వినాయకులను పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం' అనే లక్ష్యంతో పర్యావరణ ప్రేమికులు జిల్లా వ్యాప్తంగా మట్టి గణపతి ప్రతిమలను పంపిణీ చేశారు. వినాయక చవితిని పురస్కరించుకొని పలు పాఠశాలలో మట్టి, ఆకులు, కాగితాలతో విద్యార్థులు గణపతుల ప్రతిమలు తయారు చేశారు. అనంతరం విద్యార్థులు తయారు చేసిన ఏకో ఫ్రెండ్లీ మట్టి విగ్రహాలను కలెక్టర్ రాహుల్‌రాజ్‌తో పాటు అధికారులకు, ఉపాధ్యాయులకు అందజేశారు.


కలెక్టర్ రాహుల్‌రాజ్‌కు వినాయకుడిని అందజేస్తున్న ఎంజేపీ విద్యార్థులు



విద్యార్థులు తయారు చేసిన గణపతులతో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు


మట్టి వినాయకులతో విద్యార్థులు


కౌడిపల్లి: వెల్మకన్న పాఠశాలలో మట్టివినాయకుల పంపిణీ


టేక్మాల్‌లో మట్టి గణపతుల పంపిణీ

అండర్ పాస్ బ్రిడ్జి నిర్మించాలని నిరసన

చిన్నశంకరంపేట(మెదక్): జాతీయ రహదారిని దాటుతున్న క్రమంలో ప్రాణాలు పోతున్నాయని, అధికారులు స్పందించి వెంటనే అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మాణ పనులను ప్రారంభించాలని నార్సింగి మండలం వల్లూర్ గ్రామస్తులు కోరారు. ఈ మేరకు మంగళవారం గ్రామస్తులు పెద్ద సంఖ్యలో జాతీయ రహదారి వద్దకు చేరుకుని నిరసన వ్యక్తం చేశారు. జాతీయ రహదారి నుంచి వల్లూర్‌కి వెళ్లేందుకు అండర్ పాస్ నిర్మాణం కోసం నిధులు మంజూరైనా అధికారులు సర్వీస్ రోడ్ నిర్మించి వదిలేశారని గ్రామస్తులు ఆరోపించారు. జాతీయ రహదారి పక్కన భూములు ఉన్న కొందరికి లాభం చేసేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. ఈ విషయాన్ని గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ సబిత, నర్సింహులు ఎంపీ రఘునందన్‌రావు, ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ఫోన్ చేసి వివరించారు. అనంతరం అధికారులతో మాట్లాడి అండర్ పాస్ బ్రిడ్జి నిర్మించేలా చర్యలు చేపట్టనున్నట్లు గ్రామస్తులకు భరోసా కల్పించారు. విషయం తెలుసుకున్న నార్సింగి ఎస్‌ఐ సృజన అక్కడికి చేరుకుని గ్రామస్తులను జాతీయ రహదారిపైకి రాకుండా సముదాయించారు.


వల్లూర్ జాతీయ రహదారి వద్ద గ్రామస్తులను సముదాయిస్తున్న ఎస్‌ఐ సృజన

మోతాదుకు మించి ఎరువులు వాడొద్దు

కౌడిపల్లి(నర్సాపూర్): పంటల సాగులో జాగ్రత్తలు పాటించాలని మల్లారెడ్డి వ్యవసాయ యూనివర్సిటీ విద్యార్థులు రైతులకు సూచించారు. రావే (రూరల్ అగ్రికల్చర్ వర్క్ ఎక్స్‌పీరియన్స్)లో భాగంగా మంగళవారం మండలంలోని ముట్రాజ్‌పల్లి కేవీకేను విద్యార్థులు సందర్శించారు. ఈ సందర్భంగా కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ శ్రీకాంత్ పర్యవేక్షణలో రైతులకు పంటలసాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చిత్రపటం వేసి అవగాహన కల్పించారు. ఈసందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ రైతులు ప్రతి రోజు పంటలను పరిశీలించాలన్నారు. మోతాదుకు మించి ఎరువులు వాడొద్దని సూచించారు. పంటలకు చీడపీడలు సోకితే వ్యవసాయ అధికారులు సూచనలమేరకు క్రిమిసంహారక మందులు వాడాలన్నారు. పురుగుల మందులు వాడేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు చందన, భార్గవి, అనూష, ఆదిత్య, అనూష, అద్వైత, అక్షిత, మాజీ సర్పంచ్ సంజీవ్, మాజీ ఎంపీటీసీ ప్రవీన్‌కుమార్, గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.


రైతులకు అవగాహన కల్పిస్తున్న మల్లారెడ్డి యూనివర్సిటీ విద్యార్థులు

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

కొల్చారం(నర్సాపూర్): చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎంఈఓ సత్యనారాయణ రావు ఉపాధ్యాయులకు సూచించారు. మంగళవారం ఎంఆర్సీ కార్యాలయ సమావేశ మందిరంలో టీచర్ సపోర్ట్ గ్రూప్‌పై ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. బేస్‌లైన్ టెస్ట్ ఆధారంగా విద్యార్థుల ప్రతిభను గుర్తించి రిజిస్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. తరగతి, సబ్జెక్టు వారీగా వివరాలు నమోదు చేసి చదువులో వెనుకబడిన పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. 20 రోజుల ప్రణాళికలో భాగంగా తెలుగు, ఇంగ్లిష్ అక్షరాలు, ధ్వని గుర్తింపు, గణితంలో సంఖ్యామానం, గణిత ప్రక్రియలను రోజువారీ కార్యక్రమాల్లో భాగంగా నేర్పాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. ఈ సదస్సులో రంగంపేట, కొల్చారం కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ఉపేందర్ రెడ్డి, రేవతి దేవి, సీఆర్పీలు, సిబ్బంది పాల్గొన్నారు.


అవగాహన సదస్సులో ఉపాధ్యాయులు

తహసీల్దార్‌కు బీజేపీ నాయకుల వినతి


వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

మనోహరాబాద్(తూప్రాన్): కాంగ్రెస్ ప్రభుత్వం ఆరుగ్యారంటీలను అమలు చేయడం లేదని రాష్ట్ర సర్పంచ్ ఫోరం మాజీ ఉపాధ్యక్షుడు నత్తి మల్లేష్, బీజేపీ మండల అధ్యక్షుడు బక్క వెంకటేష్‌గౌడ్‌లు ఆరోపించారు. మంగళవారం మండల శాఖ ఆధ్వర్యంలో తహసీల్దార్ ఆంజనేయులుకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ మెంబర్ నరేందర్‌చారి, మండల ఉపాధ్యక్షులు సాదు సత్యనారాయణ, నరేష్‌గౌడ్, మల్లేష్, కృష్ణ, కిరణ్, మహేష్, చాకలి మల్లేష్, రాజేష్‌గౌడ్, హరిబాబుగౌడ్, ప్రవీణ్‌యాదవ్, నరేందర్, రచ్చ శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

మెదక్-చేగుంట రహదారిపై ప్రమాదకర మలుపు


అంబాజిపేట వద్ద మెదక్-చేగుంట ప్రధాన రహదారిపై ప్రమాదకర మలుపు

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని అంబాజిపేట వద్ద మెదక్–చేగుంట ప్రధాన రహదారిపై మూలమలుపు ప్రమాదకరంగా మారింది. ఈ ప్రాంతంలో గతంలో ఇక్కడ వాహనాలు ప్రమాదానికి గురై అనేక మంది మృత్యువాత పడ్డారు. దీంతో పోలీస్‌లు వాహనం వేగం తగ్గించుకొని వెళ్లేలా స్టాపర్లు ఏర్పాటు చేశారు. తాజాగా ఇక్కడ పోలీస్‌లు ఏర్పాటు చేసిన స్టాపర్లను తొలగించడంతో వాహనదారులు వేగంగా వస్తు ప్రమాదాలకు గురైతున్న సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. అధికారులు స్పందించి పోలీస్‌స్టాపర్లు లేదా స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

యూరియా సరఫరాలో ప్రభుత్వం విఫలం


ఎమ్మెల్యే సునీతారెడ్డి
నూతన కమిటీ సభ్యులతో ఎమ్మెల్యే సునీతారెడ్డి

కౌడిపల్లి(నర్సాపూర్): కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను బీఆర్‌ఎస్ కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే సునీతారెడ్డి సూచించారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన బీఆర్‌ఎస్ ముఖ్య నాయకుల సమావేశంలో నూతన కమిటీని ప్రకటించారు. గ్రామ అధ్యక్షుడిగా పురుషోత్తం, ఉపాధ్యక్షుడిగా సంగప్ప, కార్యదర్శిగా హరీష్, యూత్ అధ్యక్షుడిగా సందీప్, ప్రధాన కార్యదర్శిగా మల్లికార్జుగౌడ్, మహిళ అధ్యక్షురాలిగా కొమురమ్మ, కార్యదర్శిగా శ్యామలను ఎన్నుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్యకర్తలు పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. యూరియా సరఫరాలో ప్రభుత్వం విఫలం చెందిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు రామాగౌడ్, మాజీ ఎంపీపీ రాజు, మాజీ సీడీసీ చైర్మన్ దుర్గారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

బాధితులకు ఇందిరమ్మ ఇళ్లు

హవేళిఘణాపూర్(మెదక్): మండలంలోని మాచవరంలో గుడిసెలు కాలిపోయిన కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు ఇప్పించి అన్ని విధాలా ఆదుకుంటామని ఎమ్మెల్యే రోహిత్ అన్నారు. మంగళవారం మాచవరంలో గుడిసెలు కాలిపోయిన తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం బాధితులకు నిత్యావసర సరకులు, నగదు అందజేశారు. కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్‌చౌదరి, హఫీజొద్దీన్, శంకర్, నాగరాజు నాయకులు తదితరులు ఉన్నారు.


బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ఎమ్మెల్యే పరామర్శ

రామాయంపేట(మెదక్): ఇటీవల విద్యుదాఘాతంతో గాయాలపాలై హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తొనిగండ్లకు చెందిన అనిల్‌కుమార్‌ను ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ పరామర్శించారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఆస్పత్రికి వెళ్లి డాక్టర్లతో మాట్లాడారు. ఆయనతోపాటు మాజీ ఎంపీటీసీ నాగులు, కాంగ్రెస్ నాయకుడు నాగేశ్వర్‌రావు ఉన్నారు.

ఎనగండ్ల వాసికి ఓయూ డాక్టరేట్

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని ఎనగగండ్లకి చెందిన లింగన్న గారి ప్రవీణ్ రెడ్డికి ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ వరించింది. రైతు కుటుంబానికి చెందిన ప్రవీణ్ రెడ్డి ఉన్నత చదువుపై మక్కువతో ఓయూలో చేరి ప్రభుత్వ పాలనా శాస్త్రంలో 'పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్ షిప్ ఎ స్టడీ ఆఫ్ జీహెచ్ఎంసీ' అంశంపై పరిశోధనకు గాను డాక్టరేట్ పొందాడు. ఇటీవల ఓయూ 84వ స్నాతకోత్సవంలో గవర్నర్, ఇస్రో చైర్మన్ చేతుల మీదుగా ఈ అవార్డు అందుకున్నారు. ఈ మేరకు మంగళవారం రంగంపేట ఆశ్రమానికి వచ్చిన కాంగ్రెస్ నేత రాజిరెడ్డి ఆయనను శాలువాతో సత్కరించారు.

నానో యూరియాతో ఖర్చులు ఆదా

వెల్దుర్తి(తూప్రాన్): మాసాయిపేట ఆగ్రోస్ రైతు సేవా కేంద్రం వద్ద నానో యూరియా వాడకంతో కలిగే ఉపయోగాలపై మండల వ్యవసాయాధికారి రాజశేఖర్ రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నానో యూరియాతో ఖర్చులు ఆదా చేసుకోవచ్చన్నారు. భూసారానికి ఎటువంటి నష్టం వాటిల్లదన్నారు. తక్కువ శ్రమతో రైతులకు ఎక్కువ దిగుబడి అందించడంలో నానో యూరియా ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ రజిత, రైతులు బాలయ్య, దర్శనం, రమేష్, నాగులు అంజయ్య, మల్లమ్మ పాల్గొన్నారు.


రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ రాజశేఖర్

ఆత్మగౌరవసభ పోస్టర్ ఆవిష్కరణ

మెదక్ కలెక్టరేట్: సీపీఎస్‌ను రద్దుచేసి వెంటనే పాత పెన్షన్ అమలు చేయాలని టీజీ సీపీఎస్‌ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు దర్శన్ గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్ ఆవరణలో టీజీ సీపీఎస్‌ఈయూ ఆత్మగౌరవసభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధాప్యంలో ఉద్యోగి ఆత్మగౌరవంతో జీవించేందుకు ప్రభుత్వం పాత పెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 1న హైదరాబాద్‌లో భారీ ఎత్తున ఆత్మగౌరవ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని ఉద్యోగ, ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉపేందర్ మాట్లాడుతూ రిటైర్మెంట్ అనంతరం ఆర్థిక భద్రత ఉంటేనే వృద్ధాప్యంలో ఉద్యోగి ఆత్మ గౌరవంతో జీవిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు నర్సింలు, జిల్లా అధ్యక్షుడు దుర్గ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్‌ను రద్దు చేయాలి

నిజాంపేట(మెదక్): ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు కొండల్‌రెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఆయన సంఘం ప్రతినిధులతో కలిసి మండలంలో పర్యటించి సంఘం సభ్యత్వాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయులకు రావాల్సిన పీఆర్సీ, విశ్రాంత ఉద్యోగుల బెనిఫిట్స్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రమేశ్, కిరణ్, శ్రీనివాస్, సంజీవ్ పాల్గొన్నారు.

ఆయిల్ పామ్‌తో అధిక లాభాలు

చేగుంట(తూప్రాన్): మండలంలోని మక్కరాజీపేటలో మంగళవారం వ్యవసాయ అధికారులు ఆయిల్ పామ్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి హరిప్రసాద్ మాట్లాడుతూ భాస్కర్‌రెడ్డితో పాటు లావణ్యకు చెందిన 9 ఎకరాల్లో వ్యవసాయ పొలాల్లో ఆయిల్ పామ్ సాగు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. అలాగే ఆయిల్ పామ్‌లో అంతర పంటలకు ప్రభుత్వం నగదు అందిస్తుందని తెలిపారు. గ్రామాల్లోని రైతులు ఆయిల్ పామ్ పంటలను సాగు చేసుకుంటే ఎలాంటి కోతులబెడద ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవన ఫీల్డ్ ఆఫీసర్ సుజాత, ఏఈఓ కల్యాణి, రైతులు పాల్గొన్నారు.


ఆయిల్ పామ్ మొక్క నాటుతున్న అధికారులు

సంక్షిప్త వార్తలు

◆ ప్రతి ఒక్కరూ లేబర్ కార్డులు తీసుకోవాలి

టేక్మాల్(మెదక్): ప్రతి ఒక్కరూ లేబర్ కార్డులను తీసుకోవాలని జిల్లా భవన నిర్మాణ కార్మిక సంస్థ అధ్యక్షుడు కొండి లక్ష్మణ్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో ఇశ్రాం కార్డులు తీసుకోవాలని సూచించారు. జిల్లా లేబర్ కార్యాలయంలో ఇశ్రాం కార్డులు ఇస్తారన్నారు. ఈ మేరకు రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, బ్యాంక్ అకౌంట్, రెండు ఫోటోలు, ఫోన్ నంబర్ కార్డుతో చేయించుకోవాలన్నారు. అనంతరం జిల్లా సహాయ కార్మిక శాఖ అధికారి సత్యేంద్ర ప్రసాద్ సంప్రదిస్తే లేబర్ కార్డు అందిస్తారని తెలిపారు. కార్మికులు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

◆ కాంగ్రెస్ నేతల పరామర్శ..

వెల్దుర్తి(తూప్రాన్): వీధికుక్కదాడిలో గాయపడి మెదక్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మాసాయిపేటకి చెందిన పలువురు బాధితులను మంగళవారం నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ రాజిరెడ్డి పరామర్శించారు. ఈ మేరకు బాధితులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్యులకు సూచించారు. అలాగే వీధి కుక్కదాడిలో 20 మంది గాయపడిన ఘటనపై కలెక్టర్ వెంటనే స్పందించారు. అనంతరం కలెక్టర్ ఆదేశాల మేరకు డీఎల్‌పీఓ యాదయ్య, తహసీల్దార్ జ్ఞానజ్యోతి ఆధ్వర్యంలో మెదక్ మున్సిపాలిటీ సిబ్బంది, గ్రామ పంచాయతీ సిబ్బంది కలిసి మాసాయిపేటలో తిరుగుతున్న కుక్కలను పట్టుకొని తరలించారు. బాధితులను పరామర్శించిన వారిలో నాయకులు నరేందర్‌రెడ్డి, శ్రీకాంత్‌నాగిరెడ్డి, నాగరాజు తదితరులు ఉన్నారు.

◆ బస్టాండ్‌లో తనిఖీలు..

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రంలోని బస్టాండ్‌తోపాటు పరిసరాలు, పలు దుకాణాల్లో పోలీసులు డాగ్స్, బాంబ్‌స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహించారు. మంగళవారం స్థానిక ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి ఆధ్వర్యంలో తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ ప్రజలకు భద్రత కల్పించడం పోలీసుల లక్ష్యమన్నారు. అలాగే సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏపీకే లింకులు, మెసేజ్‌లు ఓపెన్ చేయవద్దని సూచించారు.

◆ విద్యార్థి వద్దకే ఉపాధ్యాయుడు

చిలప్‌చెడ్(నర్సాపూర్): విద్యార్థి పాఠశాలకు రాకపోతే.. విద్యార్థిని వెతుక్కుంటూ ఉపాధ్యాయుడే వెళ్లి ఆ విద్యార్థిని పాఠశాలకు తీసుకొచ్చాడు. మండల పరిధిలోని చండూర్ ఉన్నత పాఠశాలకు ఇటీవల పదోన్నతిపై రమేష్ వచ్చాడు. మంగళవారం ఆయన అన్ని తరగతులలో హాజరుశాతం పరిశీలించి, పాఠశాలకు రాని విద్యార్థులకు ఇంటికి స్వయంగా వెళ్లి పాఠశాలకు ఎందుకు రాలేదో, విద్యార్థుల తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. సరైన కారణం లేకుండా ఇంటి వద్ద ఉన్న విద్యార్థులను, వినాయక మండపాల వద్ద ఉన్న విద్యార్థులను దగ్గరుండి పాఠశాలకు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ ..ప్రతి విద్యార్థి పాఠశాలకు హాజరు కావాల్సిందేనని, విద్యార్థికి ఏదైనా సమస్య ఉంటే తల్లిదండ్రులు తెలియజేయాలన్నారు. ఏ విద్యార్థి అయినా పాఠశాలకు రాకపోతే, తానే ఇంటికి వస్తానన్నారు.

◆ మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

హవేళిఘణాపూర్(మెదక్): మండల కేంద్రానికి చెందిన నరేశ్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ మేరకు బాధిత కుటుంబానికి లీలా స్వచ్ఛంద సంస్థ గ్రూప్ చైర్మన్ మోహన్‌నాయక్ ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్, సత్యనారాయణ, శ్రీపాల్, షకీల్, నరేశ్, కృష్ణ పాల్గొన్నారు.

◆ రాజగోపురంలోనే దుర్గమ్మకు పూజలు

పాపన్నపేట(మెదక్): ఏడుపాయల వన దుర్గా భవాని మాత పూజా కార్యక్రమాలు మంగళవారం రాజగోపురంలోనే కొనసాగాయి 13 రోజులుగా మంజీరా ప్రవాహం ఉధృతి తగ్గకపోవడంతో గర్భ గుడి తెరుచుకోలేదు. అయితే ప్రస్తుతం ఘనపురం ఆనకట్టపై 4,220 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతుందన్నారు.

◆ కేజీబీవీలో దరఖాస్తుల ఆహ్వానం

రేగోడ్(మెదక్): మండల కేంద్రంలోని కేజీబీవీలో బోధనతో పాటు ఖాళీలుగా ఉన్న పోస్టులకు అర్హత కలిగిన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని కేజీబీవీ కళాశాల ప్రిన్సిపాల్ స్వయంప్రభ మంగళవారం తెలిపారు. ఒక అతిథి అధ్యాపకులు (పీజీ సీఆర్‌టీ), ఫిజిక్స్ 1, కెమిస్ట్రీ 1 పోస్టులకు గ్రాడ్యుయేట్, బీఈడీతో పాటు సంబంధిత సబ్జెక్టు బోధనలో అనుభవం ఉండాలని తెలిపారు. అలాగే ఒక హెడ్ కుక్ పోస్టుకు పదోతరగతి, ఒక అసిస్టెంట్ కుక్ పోస్టుకు 7వ తరగతి చదివి ఉండాలని చెప్పారు. ఈ నెల 31వ తేదీ సాయంత్రం 5లోగా కేజీబీవీలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.